క్లుప్తంగా

పోలమాంబ కల్యాణ మండపం నిర్వహణకు వేలం

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయంలో ఉన్న కల్యాణ మండపం నిర్వహణకు వేలం పాట ప్రక్రియ చేపట్టారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో రెండు సంవత్సరాలకు వేలం వేయగా.. ఏడాదికి రూ.45.65 లక్షలకు నగరానికి చెందిన సింహాద్రి దక్కించుకున్నారు. రెండో సంవత్సరం పది శాతం అద్దెను పెంచనున్నారు. రెండేళ్ల కిందట వేలం వేయగా రూ.37.80 లక్షలకు వెళ్లింది. ఈ సారి రూ.7.85 లక్షలు అధికంగా వేలం పాట సాగింది. మొత్తం ఏడుగురు కల్యాణ మండపం కోసం పోటీ పడ్డారు. అదే విధంగా ప్రాంగణంలో షాపు నంబరు–1కు వేలం పాట నిర్వహించగా.. రూ.11,300కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్ సురేష్‌బాబా, ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కల్యాణ మండలం నిర్వహణను జూలై 1 నుంచి నూతనంగా కాంట్రాక్టు పొందిన వారికి అప్పగించనున్నారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బీచ్ రోడ్డు: పామ్‌బీచ్ హోటల్ దరి తీరంలో గుర్తు తెలియని ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తీరానికి ఒక మృతదేహం కొట్టుకు రావడంతో సందర్శకులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని నిర్ధారించారు. అయితే ఆ యువకుడు ఎవరు.. ఏ కారణంగా మృతి చెంది ఉంటాడు.. అనే దానిపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అత్తపై అల్లుడి దాడి

మల్రిపాలెం: అత్తపై అల్లుడు దాడి చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మంతా సుధా అనే మహిళకు ఇద్దరు కుమార్తులు. చిన్న కుమార్తె ఆశదీప్తికి 13 ఏళ్ల కిందట గణేశ్వరరావు అనే బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొంతకాలంగా వీరి మధ్య సఖ్యత లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆశదీప్తి భర్తను విడిచి తన తల్లి దగ్గరకు వచ్చి ఉంటోంది. 2022లో భర్తపై ఆమె కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంకా ఆ కేసు కోర్టులోనే ఉంది. బుధవారం గణేశ్వరరావు భార్య ఇంటికి వచ్చి గొడవ పడి సామగ్రి తీసుకెళ్లే క్రమంలో అత్త సుధ అడ్డు చెప్పడంతో ఆమెను ఒక్కసారిగా తోసివేశాడు. దీంతో ఆమె వ్యాన్ మీద పడిపోగా గాయాలయ్యాయి. కంచరపాలెం పోలీసులకు సుధ ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన అమ్మవార్ల పండగ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెం ప్రాంత ఆరాధ్య దేవతలు భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోలమాంబ అమ్మవార్ల పండగ బుధవారం వైభవంగా ముగిసింది. వేకువ జాము నుంచి అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చన, పంచామృతాభిషేకాలు చేశారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

పీఎం పాలెం: రౌడీ షీటర్లపై ప్రత్యేకంగా నిఘా కొనసాగుతోందని, పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ శివరామరెడ్డి హెచ్చరించారు. పీఎం పాలెం, భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్లకు మంగళవారం రాత్రి ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిఘా నిరంతరం ఉంటుందని, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు కూడా వెనకాడేది లేదని హెచ్చరించారు.

సమాజానికి సంజీవని యోగా

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం


స్పోర్ట్స్ ఎరీనాలో ధ్యానం చేస్తున్న చిన్నారులు


ఏయూలో యోగా సాధన చేస్తున్న సభ్యులు


యోగా దినోత్సవంలో పాల్గొన్న మెడికవర్ సిబ్బంది


కృష్ణా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది


విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో విద్యార్థినుల యోగా విన్యాసం

అరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తూర్పు నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. యోగాసనాలను ఉపయోగించి చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ యోగా సాధనతో మంచి ఆరోగ్యంతో పాటు మెదడుకు మంచి ఆలోచనా శక్తిని ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, ప్రొఫెసర్ పి.ఎస్.అవధాని, పాఠశాల కరెస్పాండెంట్ ఆర్.నర్సింగరావు నాయుడు, ప్రధానోపాధ్యాయురాలు మాధురి పాల్గొన్నారు.

- చినగదిలిలో నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగాచార్యుడు బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. వారం రోజులుగా ఇక్కడ ఆయన యువకులు, వృద్ధులకు యోగసనాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షకులు ఆయనను బుధవారం సత్కరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఏయూ క్యాంపస్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని యోగా శిక్షకురాలు నళిని అన్నారు. బుధవారం ఉదయం ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్(ఐఐఐడీ), ఎవరెస్ట్ ప్లేవుడ్ సంస్థ సంయుక్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె సభ్యులకు యోగా ప్రాశస్త్యం వివరించి, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం సాధన చేయించారు. ఎవరెస్ట్ ప్లేవుడ్ సంస్థ డైరెక్టర్ అమిన్ గార్గ్ మాట్లాడుతూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పించడానికి, యోగాను సమాజానికి చేరువ చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ ఎం.రమాశంకర్, ఏఎస్ఎం నరేష్‌కుమార్, ఐఐఐడీ సభ్యులు మౌనిక, కుమార్, అభిజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న మానసిక వికలాంగ విద్యార్థులు

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్తంగా యోగాపై అవగాహన కల్పించారు. శ్రీరామచంద్ర మిషన్ నిర్వాహకురాలు పద్మశ్రీ లీల, సుసర్ల రమా కళాశాల అధ్యాపకులు, సిబ్బందికి యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నభారతి, ఉమామహేశ్వరరావు, సుధీర్, శామ్యూల్ డేవిడ్‌రాజ్, యోగా కో ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.


బీవీకే పాఠశాలలో యోగా శిబిరంలో మాట్లాడుతున్న మేయర్ హరివెంకటకుమారి

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీసత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు డాక్టర్ సూర్యప్రకాష్, పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

- మెడికవర్ ఆస్పత్రిలో కార్డియోథొరాసిక్ డైరెక్టర్, యోగా శిక్షకుడు డాక్టర్ పాడి కరుణాకర్ సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ నిశ్చల, డాక్టర్ మోహన్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.
- ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో ఏయూ యోగా విభాగం సహాయ ఆచార్యుడు డాక్టర్ తులసీరావు ఆధ్వర్యంలో సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో డైరెక్టర్ గోనిపాటి ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.
- హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాలలో యోగా గురువు వెంకటరమణ దివ్యాంగ విద్యార్థులతో సూర్యనమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు కండిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.
- ఎంవీపీ కాలనీ సెక్టార్–8 ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో క్రీడాకారులు, మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని సూర్యనమస్కారాలతో పాటు పలు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎరీనా నిర్వాహకుడు సహాని, యోగా గురువు అర్జున్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్‌స్టేషన్ 33/11 కేవీలో కైలాసగిరి 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, తోటగరువు, బీఎస్ఆర్ నగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు


నారాయణ(ఫైల్)

ఎంవీపీ కాలనీ: స్థానిక గాదిరాజు ప్యాలెస్‌లో పని చేస్తున్న నారాయణ అలియాస్ గణేష్ అనే యువకుడు అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గుర్ల గ్రామానికి చెందిన నారాయణ ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని గాదిరాజు ప్యాలెస్‌లోని రెస్టారెంట్‌లో వంటి మనిషిగా పనిచేస్తున్నాడు. ఈయన ఈ నెల 13వ తేదీ నుంచి విధులకు హాజరు కావడంలేదు. రెస్టారెంట్ నిర్వాహకుల సమాచారంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. నారాయణ తమ్ముడు తాతబాబు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం


త్రోబాల్ పోటీల్లో 2కే20 జట్టు తరఫున మద్ది సర్వ్‌ను ఎదుర్కొంటున్న ఈకే22జట్టు

విశాఖ స్పోర్ట్స్: పేస్–23 పేరిట నిర్వహిస్తున్న ఏఎంసీ వార్షిక క్రీడా పోటీలు బుధవారం మేజర్ ఎడ్విన్ స్మారక గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఏఎంసీ సెంటినరీ వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ పోటీలను ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. స్టూడెంట్స్‌కు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నిస్, టీటీ, చెస్, క్యారమ్ పోటీలు, ఫ్యాకల్టీకి క్రికెట్, త్రోబాల్, చెస్, క్యారమ్, టీటీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీలను పీడీ పాత్రుడు, నిర్వాహక ప్రతినిధులు కార్తీక్, హర్షిత, చెన్నకేశవ, శివసత్య పర్యవేక్షిస్తున్నారు. త్రోబాల్ ప్రారంభ పోటీలో 2కే20 బ్యాచ్ జట్టుతో 2కే22 బ్యాచ్ జట్టు తలపడింది. తొలిరోజు మెన్‌కు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

‘రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రోవర్ట్స్’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నగరానికి చెందిన యువ రచయిత నిమ్మాని సంతోష్ రచించిన ‘రైజ్ ఆఫ్ ది ప్రౌడ్ ఇంట్రోవర్ట్స్’ పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులు ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ పి.వి.నారాయణరావు, బీజేపీ కన్వీనర్ కొప్పల రామ్‌కుమార్, జీవీపీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ సరిపల్లే, విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం కె.వి.రావు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సంతోష్ మాట్లాడుతూ ఇంట్రోవర్ట్స్ అంటే అంతర్ముఖులని, నిజ జీవితంలో మనం ఇలాంటి వారిని చూస్తుంటామన్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడకుండా, జనాలకు దూరంగా, కలుపుగోలుతనం లేకుండా కొంతమంది మనకు తారసపడుతుంటారన్నారు. అటువంటి వారిని ఏ విధంగా మామూలు వ్యక్తులుగా మార్చుకోవాలి దానికి సంబంధించిన టెక్నిక్స్, ఎక్సర్‌సైజ్‌లు పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు.

ఇండియన్ ఐడల్ సౌజన్యకు ఘన సన్మానం


సౌజన్యను సత్కరిస్తున్న కంచర్ల తదితరులు

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఇటీవల ఇండియన్ ఐడల్‌లో అద్భుతమైన గీతాలు పాడి ప్రథమ స్థానం కైవసం చేసుకున్న సౌజన్య భాగవతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సినీ నటుడు కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ చిన్ననాటి నుంచి కర్ణాటక సంగీతంలో మంచి పట్టు ఉన్న సౌజన్య భాగవతుల తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సినిమా పాటల ద్వారా ప్రేక్షకులకు చేరవయ్యారన్నారు. ఒకవైపు గాయనిగా రాణిస్తూ.. ఐటీ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఓ సజీవ శిల్పం శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, విశాఖ సంగీత కళాకారుల సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు పాల్గొన్నారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ సందర్శన


ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను సందర్శిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధునికీకరించిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి బుధవారం సందర్శించారు. విశాఖకు విచ్చేసిన ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో కలిసి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కళలకు నిలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నిలిపే దిశగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని వీసీ తెలిపారు. దీనిపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు చేరుకున్న మెట్ల నిర్మాణం


శ్రీవారి ఆలయం వద్ద నిర్మిస్తున్న మెట్లు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు నడుస్తూ చేరుకునేందుకు మెట్ల నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయి. మెట్ల నిర్మాణం పూర్తికాగా వాటి చుట్టూ గోడ, పైన శ్లాబ్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీవారి ఆలయానికి చేరుకునేందుకు ఇప్పటికే సుందరమైన ఘాట్ రోడ్డు అందుబాటులో ఉంది. కొండ దిగువ భాగం నుంచి ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వరకు ఉన్న శ్రీవారి శంఖు, నామ, చక్రాల వరకు ఈ మెట్లు ఉంటాయి. అక్కడ నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో ఆలయం ఉండటంతో భక్తులు సులభంగానే చేరుకోవచ్చు. మెత్తం 240 మెట్లు, మధ్యమధ్యలో ఫ్లాట్‌ఫారం నిర్మిస్తున్నారు. తిరుపతి తరహాలో భక్తులకు ఎండతోగానీ, వర్షంతోగానీ ఇబ్బంది లేకుండా ఉండేదుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు క్షేమంగా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోవచ్చు. మెట్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, శ్రావణ మాసంలో అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఏఈవో జగన్ మోహనాచార్యులు తెలిపారు. భక్తులు సులువుగా మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

- 28వ వార్డు జైసంతోషిమాత కాలనీలో సమస్యలకు పరిష్కారం
- రూ.38 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం


పూర్తయిన సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ మరమ్మతులు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు జైసంతోషిమాత కాలనీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పదేళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. మొదటి దశలో కాలనీలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులకు సుమారు రూ.38 లక్షలు మంజూరయ్యాయి. వర్షం పడితే కాలనీ మొత్తం బురదతో నిండిపోయేది. మరో వైపు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై మురుగునీరు రోడ్డుపైకి పొంగి ప్రవహించేది. దుర్వాసనతో నానా అవస్థలు పడ్డామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం..



పదేళ్లుగా మా ప్రాంత ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఎప్పటికప్పుడు రోడ్డుపైకి నీరు వచ్చేది. సీసీ రోడ్లు పాడైపోయాయి. జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు డ్రైనేజీ, సీసీ రోడ్ల మరమ్మతులు చేపట్టారు. జీవీఎంసీ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– సిహెచ్.నర్సింహ, జైసంతోషిమాత కాలనీ ప్రెసిడెంట్

వార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



వార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. జీవీఎంసీ ప్రణాళికలో భాగంగా 28వ వార్డు అభివృద్ధికి కావలసిన నిధులను మేయర్ గొలగాని హరివెంకటకుమారి మంజూరు చేశారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు ఇలా ప్రజలకు అవసరమైన వాటిని ఇబ్బందులు లేకుండా అందిస్తున్నాం. మరిన్ని అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తాం.

– పల్లా దుర్గారావు, వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి

వైభవంగా నిత్యకల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

860వ రోజుకు ‘ఉక్కు’రిలే దీక్షలు


కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. దీనిని అడ్డుకుని తీరతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 860వ రోజు బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ప్రతిఘటిస్తారని, ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేనివ్వరని అన్నారు.

ఎరక్కపోయి ఇరుక్కుపోయింది


డ్రమ్‌లో ఇరుక్కుపోయిన గేదె తల భాగం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు సోమన్నపాలెం కంచికామాక్షి ఆలయం వద్ద ఓ గేదె ప్లాస్టిక్ డ్రమ్‌లో ఆహారాన్ని తినేందుకు వచ్చింది. దానిలో నోరు పెట్టి ఆహారం తినే క్రమంలో మెడ భాగం ఆ డ్రమ్‌లో ఇరుక్కుపోయింది. ఇబ్బంది పడుతున్న గేదెను చూసి స్థానిక యువకులు డ్రమ్ తొలగించారు. బతుకు జీవుడా అంటూ ఆ గేదె అక్కడి నుంచి వెళ్లిపోయింది.

దిశ పోలీసుల విచారణ


ఎన్ఏడీ జంక్షన్‌లో విచారణ చేస్తున్న దిశ డీఎస్పీ వివేకానంద్

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన బాలికపై వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటనపై దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వివేకానంద్ విచారణ చేపట్టారు. నాలుగేళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ కేసును ఎయిర్‌పోర్టు జోన్ పోలీసులు దిశ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో దిశ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ఫిర్యాది రోజామణి సమక్షంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని వివేకానంద్ తెలిపారు.